# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1) **గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం పారదర్శకంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.**

2) **రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి మినిమార్టులు ఏర్పాటు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.**

3) **పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**

4) **ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆస్పత్రులకు ప్రభుత్వం 919 కోట్ల రూపాయలను విడుదల చేసింది.**

==========================

గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం పారదర్శకంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు , ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయనే వివరాలతోపాటు పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, స్మశానవాటికల పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆయన సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ఆయన నిన్న మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న ప్రగతిపై చర్చించారు. ఈ సర్వే నివేదికలు ఆధారంగా గ్రామాల్లో భూములకు రక్షణ కల్పించడంతోపాటు ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా నూతన ఆదాయ వనరులను సృష్టించవచ్చని పవన్ కళ్యాణ్ అన్నారు.

------------------------

రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో వెయ్యి మినిమార్టులు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన నిన్న కేంద్ర ఆహారం, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ

..వాయిస్ ---30 సెకన్లు

---------------------------

వెనక బడిన వర్గాల వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆదరణ పథకం ద్వారా ఆధునిక పనిముట్లు అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆదరణ 3 పథకం ద్వారా బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు. గుంటూరు జిల్లా అమరావతిలోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత నిన్న ఆదరణ 3.0 పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆదరణ 3.0 పథకం అమలులో భాగంగా కుల వృత్తుల వారికి ఎటువంటి ఆధునిక పరికరాలు ఇవ్వనున్నారో వివరించారు. యువతకు కూడా ఉపాధి లభించేలా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆస్పత్రులకు 919 కోట్ల రూపాయలను విడుదల చేసామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 785 ప్రైవేట్ ఆస్పత్రులు బకాయిల విడుదల కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ ఆస్పత్రులకు మొత్తం 5 వేల 556 కోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. అదనంగా మరో 919 కోట్ల 13 లక్షల రూపాయలు విడుదల చేశామని అన్నారు. ఆరోగ్య సేవల బలోపేతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

---------------------------

మత్స్యకారులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతుందని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఆయన నిన్న కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మత్స్యకారుల సేవలో.. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ

..వాయిస్ --..30 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశల్లో ఉన్న సూక్ష్మ, చిన్న , మధ్య తరహా పరిశ్రమల పార్కులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో ఆయన ఎంఎస్ఎంఈ పార్కులపై సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న పార్కుల పురోగతి, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జోనల్ అధికారులు నిర్మాణంలో ఉన్న పార్కులను సందర్శించి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డులో పొందుపరచాలని ఆదేశించారు.

---------------------------

పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, శాసన సభ్యులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ఆయన అధికారులును ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఆయన నిన్న హైదరాబాద్ లో సమావేశమయ్యారు.

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలకమైన సూచనలు చేశారు. ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు .

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134 వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాల కోసం ఉన్న గరిష్ఠ వయోపరిమితిని రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లు పెంచింది. గతంలో పెంచిన వయో పరిమితి గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసిన నేపథ్యంలో... తాజాగా మళ్లీ పెంచుతూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది పాటు ప్రభుత్వం చేపట్టే ప్రత్యక్ష నియామకాలకు ఈ పెంపు వర్తిస్తుందని తెలిపింది. దీని ప్రకారం జనరల్ కేటగిరి అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెరుగుతుంది.

---------------------------

జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆయన నిన్న హైదరాబాద్ సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఈసారి సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వికాస్ రాజ్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుందని, ఈరోజు ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో 41 డిగ్రీల నుంచి 47 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

---------------------------

కర్ణాటక, రాయలసీమ మీదుగా దక్షిణ కోస్తాంధ్రపై ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉందని. దీని ప్రభావంతో రాయలసీమలో చెదురు మదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు...

..వాయిస్ ..25 సెకన్లు

====================